# విలసిత

**మా** స్వస్థలం విడపలపాడు. ఇప్పుడు అక్కడ మాకు పొలాలు తప్ప ఏమీలేవు. సంవత్సరాల నుండి కౌలులో ఉన్నాయి. వాటి తాలూకు డబ్బులు సరిగా అందవు. తెచ్చి ఇవ్వరు. అంతదూరం వెళ్ళి తెచ్చుకుంటూ ఉండాలి. ఆ పొలాల్ని ఎంతో కొంతకు అమ్మేద్దామని చాలాసార్లు అనుకున్నాను. ఆ అనుకోవడం అనుకోవడంగానే మిగిలిపోయింది.

కౌలు డబ్బులు వసూలు చేసుకుని నేనూ, నా స్నేహితుడు సలీం విడపలపాడు నుండి ఆ మధ్యాహ్నం రెండు గంటలకు ఒంగోలు మీదుగా హైదరాబాద్ కారులో చేరుకోవాలి. ఒంగోలులో మూడు నాలుగు గంటల పని ఉంది. ఆలస్యం కాదనే అనుకుంటున్నాను. ఒహవేళ ఆలస్యం అయినా తెల్లవారేసరికి హైదరాబాద్ చేరుకోవడం తప్పనిసరి. పనుల ఒత్తిడిలో నాకు తీరిక తక్కువగా ఉంటుంది. ఒక్కరోజుకు అడుగు బయటకు వేస్తే చాలాపనులు నిలుచుండి పోతాయి. సెలవులు నాకు అందని విషయం.

విడపలపాడు దాటి ఆరేడు కిలోమీటర్లు వచ్చి ఉంటాం. రోడ్డుకు కొద్దిగా దూరంగా మామిడిచెట్ల మధ్య పాత పెంకుటిల్లు కనిపించగానే కారాపమని సలీంతో అన్నాను. రోడ్డు పక్కగా కారాపాడు. తలుపు తెరిచి కారుదిగాను. సలీం కూడా కారుదిగి, "ఏమిటి విశేషం?" అడిగాడు.

రెండు రోజులు జరిగితే క్రిస్మస్ వస్తుంది. చల్లటి గాలి రెపరెపలాడుతూ వీస్తోంది.

"ఆ పెంకుటింటికి వెళ్దాం" అన్నాను.

సలీం ఒళ్ళు విరుచుకుని, "అది మీదా?" అడిగాడు.

అతనా ఊరు నాతో రావడం అదే మొదటిసారి. అంతకు ముందు వచ్చినప్పుడెప్పుడూ ఆ పెంకుటిల్లు నా దృష్టిని ఆకర్షించలేదు.

"ఒకప్పుడు ఇప్పుడా ఇంటిమీద, చుట్టూ ఉన్న తోటమీద మాకు హక్కులేమీ లేవు. మా ముత్తాత ఆ ఇంటిని కట్టారు. మా తాత దాన్ని మిషనరీ ఎయిడెడ్ స్కూలుకిచ్చాడు. ప్రభుత్వం స్కూళ్ళకు ఎయిడ్ తీసేస్తోంటే టీచర్లు, టీచర్లతో పాటు

పిల్లలూ తగ్గిపోయారు. ఈ స్కూలేకాదు, చాలా ఎయిడెడ్ స్కూళ్ళు మూసేశారు. ఇప్పుడు పిల్లల నవ్వులూ, కేరింతలూ వినబడుతోంటే తిరిగి స్కూలు తెరిచారేమో అనిపిస్తోంది. "రా. చూసొద్దాం" అన్నాను.

రోడ్డు దాటి స్కూలు ఆవరణలోకి నడిచాం. ముఖద్వారం గోడకు ఆనించి 'అనాథ శరణాలయం' అని పెద్ద అక్షరాలతో రాసి ఉన్న బోర్డు ఉంది. దానికింద చిన్న అక్షరాల్లో ప్రభుత్వేతర సంస్థ పేరు ఉంది. ఆ బోర్డు ముఖద్వారం గోడల పయికి ఎక్కించలేదు. ఇంటికి ప్రహరీగోడకు ఈ మధ్యనే సున్నం కొట్టించినట్టున్నారు. తాతయ్య హయాంలో ఆ ఇల్లు ఎంతో కళగా, బంధువులతో నిండుగా ఉండేదని అమ్మ నాతో చాలా సార్లు అంది. అక్కడో సంఘటన, ఇక్కడో సంఘటన తప్ప నాకు అన్నీ గుర్తులేవు. తాతయ్య, అమ్మమ్మలు బాగా గుర్తున్నారు. ఇప్పుడు తాతయ్య లేరు. అమ్మమ్మ లేదు. అమ్మ కూడా లేదు. అక్కయ్య ఇంగ్లాండులో స్థిరపడిపోయింది. భార్యాభర్తలిద్దరూ డాక్టర్లుగా మంచి పేరు తెచ్చుకున్నారు. అక్కయ్యకు పిల్లలు లేరు.

పదీ పదిహేను వయసు పిల్లలు రెండు జట్లుగా విడిపోయి సరివిచెట్లకు క్రిస్మస్ స్టార్లు పెట్టి రంగురంగుల కాయితాలు, చిన్న చిన్న బొమ్మలు అమరుస్తున్నారు. అంతకన్నా వయసు తక్కువ ఉన్న పిల్లలు సహాయం చేస్తున్నారు. అందరూ ఉత్సాహంగా ఆనందంగా ఉన్నారు. నన్నూ సలీంను చూసి అయిదు నిమిషాల పాటు చేస్తున్న పనులు ఆపి తిరిగి పనుల్లో లీనమయిపోయారు.

వరండా మెట్ల దగ్గరకు చేరుకున్నామో, లేదో లోపల నుండి నలభయి సంవత్సరాలున్న ఒకామె వచ్చి నమస్కరిస్తూ ఆగింది. ఆగి ప్రతి నమస్కారం చేశాను. ఆమె వెనుకలే వంటలక్క అనుకుంటాను, బయటకు వచ్చి గోడకానుకుని నుంచుంది. చేతిలో గరిట ఉంది.

"నా పేరు వీరాబాయి... ఈ ఆశ్రమం కేర్ టేకర్‌ను" సన్నగా, పొడుగ్గా, చామనచాయలో ఉంది.

"పిల్లలు క్రిస్‌మస్ ట్రీలు అలంకరిస్తోంటే ముచ్చటవేసి చూసి వెళ్దామని వచ్చాం" అన్నాను.

"మీరు విడపలపాడులో ఉంటున్నారా?" అడిగింది.

"లేదండీ. హైదరాబాద్‌లో ఉంటున్నాం. చిన్నపని మీద మీ ఊరు వచ్చాం" అని నా పేరు చెప్పి సలీంను పరిచయం చేసి, "ఇక్కడ ఎంత మంది పిల్లలుంటారు?" అడిగాను.

"ప్రస్తుతానికి ఇరవయి ఎనిమిది మంది ఉన్నారు. ... బయటే నుంచుండి పోయారు. లోపలకు రండి" అంటోంటే ఒకప్పటి మా ఇంట్లోకి నన్నే ఆహ్వానించినట్టనిపించింది.

వరండాలోకి రాగానే వంటలక్క రెండు కుర్చీలు తెచ్చి వేసింది. నేనూ, సలీం కూర్చున్నాం.

వీరాబాయి మర్యాదగా మాటలు చెబుతోంటే పది నిమిషాలపాటేమో విని, తర్వాత లేచి బయల్దేరబోతోంటే, "మా శరణాలయం చూడకుండానే వెళ్ళిపోతారా?" అంది.

కాదనలేదు. ఆమెను అనుసరించాం. నా చిన్నతనం ఆ ఇంట్లో గడిచింది. ఇంటిని గదులు గదులుగా చేశారు. ప్రతి గదిలోనూ రెండేసి మంచాలున్నాయి. గదులు శుభ్రంగా ఉన్నాయి. అన్ని వసతులూ ఉన్నాయి. మూయబడి ఉన్న చివరి గది చూపించడానికి వీరాబాయి ముందు ఎంచాతనో ఆసక్తి చూపించలేదు.

"ఆ గది?" కుతూహలంతో అడిగి ఆమె ముఖంలోకి చూశాను.

"అది విలసిత గది...." అయిష్టంగా కాదు కాని, చూపించనందుకు తప్పు చేసిన భావం వీరాబాయిలో కదిలింది. తలుపు నెట్టి, నాకు మటుకు వినిపించేలా, "విలసితకు కేన్సరు" అంది.

జాలితోనే గదిలోకి నడిచాను. మంచం మీద పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నదల్లా మమ్మల్ని చూసి పుస్తకం మూసి దిండు పక్కన ఉంచి లేచి కూర్చోడానికి ప్రయత్నించింది. వీలు కాలేదు. వీరాబాయి ఆమెను మెల్లగా లేపి కూర్చోబెట్టింది. స్టూలు మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చుని, "ఎలా ఉన్నావు విలసితా?" అడిగాను.

నవ్వింది. తలజుట్టు పలచగా ఉంది. మనిషి సన్నగా, పాలిపోయి ఉంది. వయసు ఎంతుంటుందో కాని చూడడానికి ఇరవయి సంవత్సరాల అమ్మాయిలా ఉంది. తల లావుగా ఉంది. కళ్ళు కూడా పెద్దగా ఉన్నాయి. విలసిత చేతులు నా చేతుల్లోకి తీసుకుని, "అందరూ క్రిస్మస్ ట్రీలను అలంకరిస్తోంటే నువ్వొక్కదానివే ఇక్కడ ఉండిపోయావు" అన్నాను.

"ఎవరూ నాతో ఆడడానికి ఇష్టపడరు" అంది.

ఎందుకని అడిగి ఆ అమ్మాయిని బాధ పెట్టడం నా కిష్టం లేదు.

"క్రిస్మస్ అంటే నీకు ఇష్టం లేదా?" అడిగాను.

"ఎందుకు లేదు? బాగా ఇష్టపడతాను... మీపేరు చెప్పలేదు".

చెప్పి, సలీంను కూడా పరిచయం చేశాను.

"మీరీ ఊళ్లోనే ఉంటున్నారా?"

"లేదు. హైదరాబాద్‌లో ఉంటాను. నీ గురించి వీరాబాయి ఆంటీ చెబితే చూసి వెళ్దామని వచ్చాను. ఎర్రదుస్తులు, టోపీ లేని శాంటాక్లాజ్‌ననుకో" అనేసరికి విలసిత పెద్దగా నవ్వింది.

నవ్వు ఆపి, "నిజం చెప్పమంటారూ నన్ను చూడడానికి డాక్టర్లూ, నర్సులూ తప్ప ఎవరూ రారు. మా అమ్మ ఎవరో తెలియదు. నాన్న ఎవరో తెలియదు. ఎవరూ లేక పోవడం కూడా ఎంతో బావుంటుందనిపిస్తుంది. ఎవరూ నా గురించి బాధపడవలసిన అవసరం ఉండదు. ఖర్చు చేయనవసరం ఉండదు. నేనెవరి గురించి ఆలోచించాల్సిన అవసరం ఉండదు... కదూ?" గుండెలు బద్దలు కొట్టుకోలేని బాధ గూడు చెదరకుండా అంది. ఆమె కళ్ళల్లో నీరు కదలలేదు. గొంతులోంచి దుఃఖం జారలేదు.

విలసితను దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దులు పెట్టుకుంటున్నప్పుడు నన్ను చుట్టేసుకుంది. వీరాబాయి ముఖంలోకి చూశాను. ఆమె ఆశ్చర్యపోతోంది.

అయిదు నిమిషాల తర్వాత విలసితను క్రిస్మస్‌ట్రీల దగ్గరకు తీసుకువెళ్ళి కుర్చీవేసి కూర్చోబెట్టి పిల్లలందరితో అన్నాను, "ఇవేళ్టి నుండి మీరందరూ విలసిత అక్కతో మాట్లాడాలి. ఆటలు ఆడాలి. విలసిత అక్క చాలా పుస్తకాలు చదువుకుంది. మీకెన్నో కథలు చెబుతుంది. మీరు 'సరే' అంటే ఇహనుండి నేను ప్రతివారం వస్తుంటాను. వస్తూ మీకేం బహుమతులు కావాలంటే అవి తెచ్చిస్తాను" అన్నాను.

అందరూ 'సరే' అన్నారు. అప్పటికి ఎవరికి ఏమేమి కావాలో సలీం కాయితం మీద రాసుకున్నాడు. మేం బయల్దేరబోతోంటే వీరాబాయి మా కూడా గేటువరకు వచ్చింది.

"పిల్లల మూలాన మీకు అనవసరమయిన ఖర్చు" అంది.

"అదేం లేదు. నా సంతోషం కొద్దీ తెస్తున్నాను... విలసితను ఆస్పత్రిలో చేర్పించకూడదూ?" అడిగాను.

వీరాబాయి వెంటనే ఏం మాట్లాడలేదు. మా కూడా ముఖద్వారం వరకు వచ్చి, "మూడు నెలల కిందటి వరకు ఆస్పత్రిలో ఉంది. టెర్మినల్ డిస్చార్జి చేశారు.

విలసిత మహా అయితే నెల బతుకుతుంది.. అంతకంటే ఎక్కువ కాదు. చాలా రోజుల తర్వాత మీరు తనతో మాట్లాడుతోంటే ఎంచక్కా నవ్వింది..” అంటోంటే నా హృదయాన్ని తీసి చుట్టుచుట్టి రోడ్డుకు అవతల ఉన్న ముళ్ళపొదల్లోకి విసిరినట్టు అనిపించింది.

ఒంగోలు వెళ్ళి పిల్లలకు కావలసినవన్నీ తీసుకొచ్చి పేరుపేరున అందరికీ ఇచ్చి విలసిత చేతే క్రిస్మస్ కేక్ కట్ చేయించి అందరితో కలిసి భోజనం చేసి వెళ్ళిపోబోతూ డబ్బు ఇవ్వబోతోంటే వీరాబాయి డబ్బు తీసుకోలేదు. “డబ్బులు తీసుకోకూడదండీ. మా సంస్థ పేరున చెక్కు రాసివ్వచ్చు” అంది. చెక్కురాసిచ్చి అందరితోనూ ఆప్యాయంగా మాట్లాడి అక్కడి నుండి బయల్దేరే సరికి తొమ్మిది దాటింది. చాలాదూరం వరకు క్రిస్మస్ స్టార్లు కనబడుతూ ఉన్నాయి.

అరగంట ప్రయాణం చేశాక, “కారాపు” అన్నాను. సలీం కారాపాడు.

ఆ క్షణంలో నా స్ఫురణలో కదిలిన మూలరాయి, అదీ అర్ధరాత్రే. నాన్న, అమ్మ, అక్క నేను ఆ ఊరు వదిలిపెట్టి వెళ్తున్నప్పుడు అక్కకు పుట్టిన అయిదు నెలల పిల్లను అమ్మ రంగు రంగుల దుప్పటిలో భద్రంగా పెట్టి నా చేతులకందించి, ఎవరూ చూడకుండా పొలల్లో ఎక్కడయినా పెట్టి వచ్చాయి” అంది. నాన్న డ్రయివింగ్ సీటులో ఉన్నాడు. అమ్మకాని, అక్కకాని ఏడవడం లేదు. మవునంగా ఉన్నారు. అప్పటికి అక్కకు పెళ్ళి కాలేదు. ఆ చిన్నపిల్లను చెట్టుకింద పెట్టేసి వస్తున్నప్పుడు మటుకు ఏడుపు ఆపుకోలేకపోయాను. ఆ పిల్ల తల విలసిత తలలా పెద్దదిగా ఉండడం నాకు ఇప్పటికీ గుర్తుంది.

ఎప్పటి సంగతి అది!

* ఆదివారం వార్త, 26 డిసెంబరను 2010